సాక్షి జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



రజకులకు పెద్దపీట వేయాలి

రజకులకు ప్రజా సంక్షేమంలో పెద్దపీట వేయాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు.

- 8లో▸



పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- 8లో▸

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని టీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0^0/19.0^0

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉన్నప్పటికీ ఆహ్లాదకరంగానే ఉంటుంది. రాత్రి చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

కోల్ ఇండియా పోటీల్లో పతకాలు



గోల్డ్ మెడల్ సాధించిన శంకర్

భూపాలపల్లి అర్బన్: బిలాస్‌పూర్‌లోని ఎస్ఈసీఎల్ కంపెనీలో జరుగుతున్న కోల్ ఇండియా షటిల్ పోటీల్లో పాల్గొన్న భూపాలపల్లి ఏరియా క్రీడాకారులు రెండు పతకాలు సాధించినట్లు ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి మారుతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షటిల్ డబుల్స్ విభాగంలో పి.శంకర్(కేటీకే 1వ గని) గోల్డ్ మెడల్ సాధించగా, సింగిల్ విభాగంలో వేముల ఓదెలు(ఎస్అండ్‌పీసీ) సిల్వర్ మెడల్ సాధించినట్లు వెల్లడించారు. ఫైనల్ మ్యాచ్‌లో ప్రతిభ కనబర్చి సింగరేణి ఖ్యాతిని కోల్ ఇండియాలో నిలపాలని ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు.

రాకేశ్‌రెడ్డికి తెలుగు సేవా రత్న పురస్కారం



టేకుమట్ల: సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన మండలంలోని రాఘవాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరె రాకేశ్‌రెడ్డికి తెలుగు సేవా రత్న పురస్కారం-2024 అందించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన పుడమి సాహితి వేదిక- మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆరవ వార్షికోత్సవ సందర్భంగా ఈ పురస్కారం అందజేసినట్లు ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, ఎక్కువ సార్లు రక్తదానం చేసినందుకు ఈ పురస్కారం లభించడం సంతోషంగా ఉందన్నారు. పురస్కారంతో బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. పుడమి సాహితి వేదిక- మానవ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చిలుమల్ల బాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్



ములుగు రూరల్: తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తోటకూరి శ్రీకాంత్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయ, వసంత్‌కుమార్, కల్యాణ్, భిక్షపతిగౌడ్, అనురాధ, శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏటూరునాగారం: సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలో సీఆర్‌టీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సీఆర్‌టీలతో వెట్టిచాకిరి చేయించుకొని చాలీచాలని వేతనాలు చెల్లిస్తుందన్నారు. అంతేకాకుండా హెల్త్‌కార్డులు, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, అశోక్, ఖాజాపాషా, తాడూరి రఘు, సంతోష్, పోశాలు, సీఆర్‌టీలు రవీందర్, రామయ్య పాల్గొన్నారు.

పండ్లు అమ్మి నిరసన



ములుగు: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టి సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ క్రమంలో ఉద్యోగులు పండ్లను అమ్మి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. క్రమబద్ధీకరించడం ఆలస్యమైతే ముందుగా పే స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తొందరగా స్పందించకపోతే పండ్లు అమ్ముకుని బతికే పరిస్థితి ఉద్యోగులకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమిడి కరుణాకర్, కుమార్ పాడియా, జీవన ప్రియ, ఎండీ ఫిరోజ్, సుజాత, రాజేశ్వరి, రమేష్, ప్రవీణ్, దేవేందర్, సుబ్బారెడ్డి, తిరుమల, చందన, జయవసంత లక్ష్మి, భాగ్యలక్ష్మి, పుష్పలీల, అశ్విని, ప్రతిభ, అర్చన తదితరులు పాల్గొన్నారు.



మానేరు వాగు వద్ద ఇసుక లోడ్ చేస్తున్న జేసీబీలు (ఫైల్)

‘మానేరు’లో మాఫియా

మల్లారం క్వారీ కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

- వే బిల్లులతో రోజుకు వందకు పైగా లారీల్లో..
- బిల్లులు లేకుండా పదుల సంఖ్యలో..
- సర్కారు ఖజానాకు భారీగా గండి
- ‘మామూలు’గానే తీసుకుంటున్న టీజీఎండీసీ అధికారులు

భూపాలపల్లి: మానేరు కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. క్వారీ యజమానుల అండదండలతో అనుమతులు లేని(జీరో) లారీలు రోజుకు పదుల సంఖ్యలో వెళ్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు కొద్ది రోజులుగా తనిఖీలు నామమాత్రంగా నిర్వహిస్తుండటంతో ఈ అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది.

మానేరు టు హనుమకొండ, హైదరాబాద్..

జయశంకర్ భూపాలపల్లి సరిహద్దులోని మల్హర్ మండలంలో గల మానేరు వాగులో గతంలో ఐదు ఇసుక క్వారీలు ఉండేవి. ప్రస్తుతం మల్లారం ఇసుక క్వారీ ఒక్కటే నడుస్తుంది. ఇక్కడి ఇసుక గోదావరి ఇసుక కంటే నాణ్యత ఎక్కువ ఉండటంతో డిమాండ్ ఎక్కువ. దీంతో లారీ యజమానులు ఇక్కడి ఇసుకనే ఎక్కువగా బుకింగ్ చేసుకుంటారు. ఈ నెల 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 3,981 లారీలు ఇసుక బుక్ చేసుకొని వే బిల్లుల ద్వారా 1,29,121 టన్నుల ఇసుకను తరలించాయి. అంటే సగటున రోజుకు 132 లారీల ఇసుక తరలి వెళ్తుంది. అయితే వే బిల్లులతో వెళ్తున్న లారీలతోపాటు బిల్లులు లేని(జీరో) లారీలు కూడా ఈ క్వారీ నుంచి వెళ్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పోలీసుల తనిఖీలు తగ్గుముఖం పట్టడంతో క్వారీ యజమానులు ఈ అక్రమ దందాకు తెరలేపినట్లు సమాచారం. రోజుకు పదుల సంఖ్యలో లారీలను హనుమకొండ, హైదరాబాద్ పట్టణాలకు అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రూ.కోట్లు గడిస్తున్నారు. అయితే గతంలో వే బిల్లులు లేని లారీలు నేరుగా వాగులోని ఇసుకను లోడ్ చేసుకొని వెళ్లేవి. కాగా వాగులోకి వెళ్తే ఇబ్బందులు వస్తాయని భావించి, ఎవరికీ అనుమానం రాకుండా డంపింగ్ యార్డు వద్దే అక్రమంగా లోడ్ చేసి తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా టీజీఎండీసీ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కలెక్టర్ హెచ్చరించినా మారని తీరు..

జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ అక్టోబర్ 21వ తేదీన జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. వే బిల్లులు లేకుండా, పరిమితికి మించి ఇసుక రవాణా చేసే లారీలను పట్టుకొని సంబంధిత యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్, టీజీఎండీసీ, మైనింగ్, రవాణా తదితర శాఖల అధికారులకు సూచించారు. అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు, ఇసుకాసురుల్లో మార్పు రాలేదు. కలెక్టర్ మరోమారు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అయితే మానేరు వాగులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా విషయమై టీజీఎండీసీ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీరాములును ‘సాక్షి’ సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

పోరాటాల గడ్డపై పొలిటికల్ జోష్!



ఏడాదిలో ఎన్నో కీలక రాజకీయ పరిణామాలు

- అభివృద్ధి, సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ముందుకు
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట.. బీజేపీ నేతల ‘మోదీ’ జపం
- కేడర్‌ను కాపాడుకునే పనిలో సీపీఐ, సీపీఎంలు

అన్ని పార్టీల టార్గెట్ - 2025

రివైండ్ 2024

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది రాజకీయంగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత సంవత్సరం డిసెంబర్‌లో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో జోష్ నింపగా.. బీఆర్ఎస్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. 12 స్థానాల్లో కాంగ్రెస్ 10 గెలుపొందగా.. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన కడియం శ్రీహరి హస్తం గూటికి చేరారు. దీంతో జనగామ స్థానం ఒక్కటే గులాబీ పార్టీ ఖాతాలో మిగలడం గమనార్హం. ఈ ఏడాది మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రెండుకు రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో మూడుసార్లు పర్యటించి అభివృద్ధికి రూ.6,500 కోట్ల నిధులు విడుదల చేశారు.

- వివరాలు 8లో▸

హక్కుల కోసం ఉద్యమించాలి

ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

గోవిందరావుపేట: ముస్లిం మైనారిటీలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని ఆవాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ అన్నారు. మండల పరిధిలోని పస్రా పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎండీ గఫూర్ అధ్యక్షతన ముస్లిం మైనారిటీల సమస్యలు, హక్కులపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ముస్లింల మీద రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయన్నారు. 1991 చట్టం ప్రకారం పురాతన కట్టడాలను ముట్టుకోవడానికి వీలు లేదని చెబుతున్న మతోన్మాద శక్తులు దానిని బేఖాతర్ చేస్తూ చట్టాన్ని ధిక్కరిస్తున్నారని విమర్శించారు. ముస్లింలు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఐక్యంగా సంఘటితంగా ఉండడం ద్వారానే హక్కులు సాధించగలుగుతామని తెలిపారు. ప్రతిఒక్కరూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆవాజ్ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు ఎస్‌డీ యాసిన్ ఘోరి, సిరాజుద్దీన్, జానీ, మహ్మద్ అఫ్రోజ్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు చదువు అవసరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: క్రీడాకారులకు క్రీడలతోపాటు చదువు ఎంతగానో అవసరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రికెట్ క్రీడోత్సవాల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహించిందన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు విద్యతోపాటు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని కోరారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10వేలతోపాటు క్రికెట్ కప్ (గర్మిళ్లపల్లి), ద్వితీయ బహుమతి రూ.5వేలతోపాటు షీల్డ్ (చిట్యాల) జట్లకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి-సత్యం, రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్, ముకిరాల మధువంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కోంరయ్య, ఓరం సమ్మయ్య, తిరుపతిరెడ్డి, రాజ్‌మహ్మద్, బుర్ర లక్ష్మణ్‌గౌడ్, కిష్టయ్య, శరత్, రాయకోంరు, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: జిల్లా నుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సొంత ఖర్చులతో టీషర్ట్స్ పంపిణీ చేశారు. క్రీడల్లో గెలుపొంది జిల్లాకు, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి రఘు, పార్టీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల శ్రీనివాస్, నాయకులు, దేవన్, బుర్ర కొమురయ్య, రాజేందర్, శ్రీనివాస్, సాంబమూర్తి, పృథ్వీ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొమురం ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్

ఏటూరునాగారం: మంగపేట మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు కళాభారతిలో ఏషియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ అకాడమి, స్ఫూర్తి అకాడమి వారు సంయుక్తంగా గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఆదివాసీల అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, పెసా కమిటీల బలోపేతానికి చేసిన కృషికి గాను ఆయనను అభినందించారు.



రైలు పట్టాలు కాదు.. రోడ్డే

ఈ ఫొటోలో కన్పిస్తున్నది.. రైలు పట్టాలు అనుకుంటే మీరు పొరపడినట్టే.. 353సీ జాతీయ రహదారిపై అధిక లోడుతో ఇసుక, బొగ్గు లారీలు వెళ్తుండడంతో రోడ్డు ఇలా గాడీలు పడి రైలు పట్టాలను తలపిస్తోంది. దీంతో భూపాలపల్లిలోని హన్‌మాన్ దేవాలయం నుంచి కేటీకే 5వ గని మూల మలుపు వరకు, కాటారం నుంచి భూపాలపల్లి వరకు ఈ మార్గంలో ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడం, జాతీయ రాహదారి విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు పరిస్థితి ఇలా మారిందని ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

- భూపాలపల్లి అర్బన్

మేడారంలో భక్తుల సందడి

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గద్దెల వద్ద దొంగల చేతివాటం
- భద్రత కల్పించాలని భక్తుల డిమాండ్



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఏపీ, తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తల్లుల దర్శనానికి తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, కానుకలు, కోళ్లు, యాటలను మొక్కుగా సమర్పించారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల వద్ద పూజలు చేశారు. భక్తుల రద్దీతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కళకళలాడింది. ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకు మినీ మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో ముందస్తుగా భక్తులు తరలివచ్చి అమ్మవార్ల మొక్కులు చెల్లించుకుంటున్నారు.

భక్తుల జేబులు ఖాళీ చేసిన దొంగలు..

జాతరలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. తల్లుల గద్దెల వద్ద పూజలు చేస్తున్న భక్తుల జేబుల్లోని డబ్బును ఖాళీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడి నుంచి రూ.8 వేలు, ఖమ్మం జిల్లాకు చెందిన మరో భక్తుడి నుంచి రూ.22 వేలు కాజేసినట్లు బాధిత భక్తులు దేవాదాయ శాఖ అధికారులకు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. కాగా, ఆది, బుధ, గురువారాల్లో జాతరకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నా కార్యనిర్వహణ అధికారి మాత్రం భక్తుల బాగోగులు పట్టించుకోవడం లేదని పూజారులు పేర్కొంటున్నారు.

జాతర నిర్వహణపై పూజారుల సమావేశం

మేడారం మినీ జాతర నిర్వహణపై పూజారులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు మాట్లాడుతూ మినీ జాతర సందర్భంగా ముందస్తుగా వచ్చే భక్తులకు అధికారులు సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో పూజారులు చంద రఘుపతి, చంద గోపాల్, కాక వెంకటేశ్వర్లు, సారయ్య, సిద్ధబోయిన జనార్ధన్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


హేమాచలక్షేత్రంలో..



హేమాచలున్ని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఉదయాన్నే బస్సులు, కార్లు, ఆటోలు ఇతర వాహనాల్లో గుట్టపైకి చేరుకున్నారు. దీంతో దైత అమ్మవారు(వనదేవత), ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంతో పాటు పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. ఉదయం 10నుంచి 12గంటల వరకు ఆలయ పూజారులు, పవన్‌కుమార్ ఆచార్యులు, శేఖర్ శర్మ స్వామివారికి నువ్వుల నూనెతో తిలతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి పట్టు వస్త్రాలతో అలంకరించారు.

జేబులు గుల్ల చేశారు



తల్లులను దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా మేడారం వచ్చా. సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో జేబులో ఉన్న రూ.22 వేలను ఎవరో కాజేశారు. ఏం చేయాలో అర్థం కాలేదు. దేవాదాయ సిబ్బందిని సంప్రదించగా సీసీ పుటేజీల ద్వారా అనుమానితులను గుర్తించారు. అధికారులు అందుబాటులో లేకపోవడం దొంగలు పెట్రేగిపోతున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు భక్తులకు సహకరించాలి.

- సాయి సురేశ్, భక్తుడు, ఖమ్మం

రుద్రేశ్వరాలయంలో శివ కల్యాణం

హన్మకొండ కల్చరల్: మాసశివరాత్రిని పురస్కరించుకుని రుద్రేశ్వర ఆలయంలో ఆదివారం శివకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఉపేంద్రశర్మ, వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకుడు సందీప్‌శర్మ, శ్రవణకుమారాచార్యులు ఉత్తిష్ఠ గణపతికి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మాసశివరాత్రి కావడంతో ఆలయ నాట్యమండపంలో రుద్రేశ్వరీదేవి అమ్మవారికి రుద్రేశ్వరస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణం స్వామి వారికి కంకణధారణ, వస్త్ర అలంకరణ, నూతన యజ్ఞోపవీత ధారణ, ఎదురుకోళ్లు, జీలకర్ర బెల్లం ధారణ, లక్ష్మీ పూజలు మాంగళ్యధారణ మొదలైన కల్యాణతంతు నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సాయి



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీలో నెలకొన్న విద్యారంగ సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో నూతన మెనూ విధానాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఏజెన్సీలోని పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ లేక విద్యారంగం కుంటుపడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా పాఠశాలలకు వస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఐటీడీఏ పీఓ స్వయంగా పరిశీలించినా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు పూనెం ప్రతాప్, రేగ గణేశ్, కృష్ణ, కె.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేయాలి

● ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి


హన్మకొండ కల్చరల్ : సంఘం లక్ష్యాలకు అనుగుణంగా సభ్యులు కృషి చేసినప్పుడే గమ్యాన్ని చేరుకుంటారని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం శంభునిపేటలో ఉమ్మడి వరంగల్ జిల్లా శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ప్రతిజిల్లాలో విశ్వబ్రాహ్మణ మహిళా సంఘాలు ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చెస్ క్రీడాకారిణి భోగోజు దేవిక, పదో తరగతి స్టేట్ టాపర్ మడుపోసు భువకృతిని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, పెందోట శ్రీనివాస్, చిలుకూరి లక్ష్మీరామాచారి, దంతోజు యశోద, అద్దంకి నాగేశ్వరరావు, రుద్రోజు భవాని, నీలోజు అరుణ, రమాదేవి, భారతి, పుష్పలీల, కొక్కొండ అమల తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు



వేటగాళ్ల అరెస్ట్ చూపుతున్న అటవీశాఖ అధికారులు

ములుగురూరల్: వన్య ప్రాణులను వేటాడితే చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ డోలి శంకర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పత్తిపల్లి గ్రామంతో పాటు జంగాలపల్లి పరిధి మేడివాగు వద్ద నాలుగు అడవి పందులు, ఒక అడవి కోడిపుంజు, ఉచ్చులను స్వాధీనం చేసుకుని ఎనిమిది మంది వేటగాళ్లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపల్లి అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్ల కోసం వెళ్తున్న క్రమంలో గ్రామంలో నర్సంపేట మండలం ఇస్రతండాకు చెందిన గుగులోత్ చిన్నలచ్చు అడవి పందిని చంపి బైక్‌పై తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ఇదే సమయంలో గ్రామంలో ములుగు మండలం బంజరుపల్లికి చెందిన దాసరి సమ్మయ్య, వనం రాజేశ్ బైక్ పై అడవి కోడిపుంజుతో పాటు ఉచ్చులను పెట్టుకుని వెళ్తుండగా పట్టుకుని ములుగు రేంజ్ తరలించామన్నారు. వీరు మేడివాగు సమీపంలో అడవి పందుల కోసం ఉచ్చులు పెట్టారన్నారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన దాసరి సారయ్య, నగేశ్, జన్నాథం సాయి, బలాని రామయ్య, జగన్నాథం నగేశ్.. అడవి పందులు చంపి పట్టుబడ్డారని తెలిపారు. అడవి జంతువులను వేటాడిన, స్మగ్లింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పోరాటాల గడ్డపై పొలిటికల్ జోష్!

సాక్షిప్రతినిధి, వరంగల్ : 2023 సంవత్సరం చివరి నెలలో వెలువడ్డ ఫలితాలు.. 2024లో రాజకీయ కీలక పరిణామాలకు బాటలు వేశాయి. ప్రధాన రాజకీయ పార్టీల వ్యూహాలు, ఎత్తుగడలు ఓరుగల్లు గడ్డపై పొలిటికల్ జోష్ నింపాయి. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మోగించిన విజయభేరి ధాటికి బీఆర్ఎస్ పార్టీ తన స్థానాలను కాపాడుకోలేక పోయింది. రాష్ట్రాన్ని దశాబ్ద కాలం పాటు పాలించిన గులాబీ పార్టీకి గత అసెంబ్లీ ఎన్నికలు మిగిల్చిన చేదు అనుభవాల నుంచి ఈ ఏడాది బయటపడే ప్రయత్నం చేసింది. పడిపోయిన చోటే పంతంతో గెలిచి నిలబడిన కాంగ్రెస్ పార్టీ పదిలపరచుకునే దిశగా ముందుకు సాగుతోంది. 12 స్థానాలకు 10 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు పాగా వేయగా, బీఆర్ఎస్ అభ్యర్థిగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి 2024లో కాంగ్రెస్ గూటికి చేరారు. జనగామ స్థానం ఒక్కటే బీఆర్ఎస్ ఖాతాలో మిగలగా.. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. పదేళ్లలో వరుసగా రెండుసార్లు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో గెలిచిన బీఆర్ఎస్.. ఓటమి పాలయ్యింది. అభివృద్ధి, సంక్షేమం పేరిట ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో ముందుకెళ్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి మూడుసార్లు పర్యటించి రూ.6,500 కోట్లకు పైగా నిధులు విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే క్రమంలో ప్రజల పక్షాన పోరుబాటను ఎంచుకుని ముందుకు సాగుతోంది. ఇక బీజేపీ కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాల ప్రచారంతో పాటు ప్రధాని మోదీ జపంతో ప్రజల్లో ఉంది. కార్మిక, శ్రామిక వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పుకుంటున్న సీపీఐ, సీపీఎం పార్టీలు కేడర్‌ను కాపాడుకునే పనిలో ఉన్నాయి.

కీలక రాజకీయాలకు వేదిక - 2024

● అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ మంత్రం
● బీఆర్ఎస్ పోరుబాట.. బీజేపీ నేతల 'మోదీ' జపం
● అన్నీ పార్టీల టార్గెట్– 2025..

కీలక పరిణామాలకు వేదిక

కీలక రాజకీయ పరిణామాలకు 2024 సంవత్సరం వేదికగా నిలిచింది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమైన పదవులు అనుభవించిన పలువురు నాయకులు పార్టీలు మార్చేశారు. ఈ సందర్భంగా కొందరికి సంతృప్తి మిగలగా.. మరికొందరు అసంతృప్తికి లోనయ్యారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడితే మంత్రి అవుతారనే ప్రచారంలో ఉన్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. ఆయన కంటే ముందు బీజేపీలో చేరిన మాజీ ఎంపీ సీతారాం నాయక్ ఓటమినే చవిచూశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ మంత్రి కడియం శ్రీహరి.. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తన కూతురు కడియం కావ్యకు బీఆర్ఎస్ టికెట్ ప్రకటించిన తర్వాత 2024 మార్చి 28 తండ్రి కూతుళ్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్ దక్కించుకున్న డాక్టర్ కడియం కావ్య వరంగల్ నుంచి ఎంపీగా పోటీచేసి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. మొత్తంగా 2024లో పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభంజనమే కొనసాగగా.. బీఆర్ఎస్ ఆ రెండు స్థానాలను కోల్పోయింది. అయితే ఓరుగల్లులో కాషాయ జెండా ఎగురవేయాలనే తాపత్రయంతో ఉన్న బీజేపీ అంచనాలు వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో మొత్తంగానే తలకిందులయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి అలయన్స్‌గా పనిచేసిన సీపీఐ, పార్టీ కార్యక్రమాలకు పరిమితమైన సీపీఎం వామపక్ష ఉద్యమాల ద్వారా కేడర్‌ను కాపాడుకుంటున్నాయి.



'స్థానిక' ఎన్నికలే లక్ష్యం..

2025లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకం కానున్నాయి. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉండడం మూలాన అత్యధికంగా ఆ పార్టీ అభ్యర్థులే గెలుచుకున్నారు. ఉమ్మడి వరంగల్‌లో గత (2019 జూలై) ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. 70 జెడ్పీటీసీ, 781 ఎంపీటీసీ స్థానాల్లో 62 జెడ్పీటీసీ, 541 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకుంది. మెజార్టీ ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పీఠాలు దక్కాయి. అంతకు ముందు 1,688 గ్రామ పంచాయతీలకు జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో అత్యధికంగా బీఆర్ఎస్ ప్రతిపాదిత అభ్యర్థులే గెలిచారు.



2020 ఫిబ్రవరిలో జరిగిన ప్రాథమిక సహకార సంఘాల (పాక్స్) ఎన్నికల్లో మొత్తం 97 సంఘాలకు 95 సంఘాలకు ఎన్నికలు జరగ్గా.. 90 బీఆర్ఎస్, ఐదు కాంగ్రెస్ గెలుచుకుంది. 1,260 డైరెక్టర్ స్థానాలకు 509 ఏకగ్రీవం కాగా, 1,098 వరకు బీఆర్ఎస్ ఖాతాలో పడ్డాయి. 2020లోనే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 9 మున్సిపాలిటీలు, 200 వార్డులకు 18 వార్డులు ఏకగ్రీవం కాగా.. 182లలో పోటీ జరిగింది. ఇందులో బీఆర్ఎస్ తొమ్మిదింట గెలవగా, అత్యధిక వార్డులు ఆ పార్టీ అభ్యర్థులే గెలిచారు. అయితే 2025లో ఈ ఎన్నికలే కీలకంగా కానుండగా.. అత్యధికంగా గెలిపించుకోవడం ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకం కానుంది.

వివాదాల సుడిగుండంలో కీలక నేతలు



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగలగా.. 2024లోనూ గడ్డు పరిస్థితులను ఎదుర్కొని నిలబడింది. అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో కీలకంగా వ్యవహరిస్తున్న పలువురు నాయకులు సవాళ్లు, విమర్శలను ఎదుర్కొన్నారు. రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పలు సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. ఓ వైపు రాజకీయ ప్రత్యర్థులు, మరోవైపు సినీ ప్రముఖులను కుదిపేసిన ఆమె మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలకు సంబంధించి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ మధ్య జరిగిన సంభాషణ ఆడియో లీక్.. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇలా.. ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కొందరి మధ్య ఏర్పడిన విభేదాలు సమసిపోయేలా చేసేందుకు హైదరాబాద్‌లో దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీలు నిర్వహించారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఫోన్‌ట్యాపింగ్ వివాదం వరంగల్‌కు కూడా చుట్టుకోగా, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సంబంధాలపై మీడియాల్లో వచ్చిన కథనాలు కలకలం రేపాయి. మాజీ ఐజీ ప్రభాకర్‌రావు నేతృత్వంలో మాజీ ఏసీపీ ప్రణీత్, శ్రావణ్ జనగామ జిల్లా కేంద్రంగా పలువురు నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయించారన్న ఆరోపణలు కొంత టెన్షన్‌కు గురి చేశాయి. అయితే దయాకర్‌రావు మాత్రం తనకు అసలే సంబంధం లేదని కొట్టిపారేసి ఆ ఆరోపణలను లైట్‌గా తీసుకోగా.. ఆ తర్వాత ఆయనపై ఫోన్ ట్యాపింగ్ ప్రస్తావనే రాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌కు దూరమైన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నా.. తన రాజకీయ ప్రత్యర్థి కడియం శ్రీహరి ఆ వైపు వెళ్లడంతో రాజయ్య బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు.

కాంగ్రెస్ నేతలకు దక్కిన కీలక పదవులు



ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో అటవీ, పర్యాటక శాఖ మంత్రిగా కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా ధనసరి సీతక్క అనసూయకు చోటు దక్కగా.. సీనియర్ కాంగ్రెస్ నేత వేం నరేందర్ రెడ్డి సీఎం ప్రధాన సలహాదారు అయ్యారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నేతలను పదవులు వరించాయి. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య నియమితులు కాగా, కాంగ్రెస్ సీనియర్ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, ఎండీ.రియాజ్‌కు తెలంగాణ గ్రంథాలయ పరిషత్, ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్ పదవులు దక్కాయి. జయశంకర్ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డికి వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్ చైర్మన్‌గా, మహబూబాబాద్ జిల్లా నుంచి టికెట్ ఆశించిన బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా అవకాశం దక్కింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న బస్వరాజు సారయ్య కాంగ్రెస్ పార్టీలో చేరగా, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్ గూటికి చేరి పీఠం పదిలపర్చుకున్నారు. మార్నేని రవీందర్‌రావు 'టెస్కాబ్' చైర్మన్‌గా కూడా నియమితులు కాగా.. పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు.

భర్త మృతి చెందాడనే మనోవేదనతో మహిళ ఆత్మహత్య



సోమలక్ష్మి(ఫైల్)

పెద్దవంగర: భర్త మృతి చెందాడనే మనోవేదనకు గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనపురం సోమలక్ష్మి (58), సోమయ్య దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. ఈ క్రమంలో సోమయ్య ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురైంది. వృద్ధాప్యంలో భర్త తోడులేకపోవడంతో మనోవేదనకు గురైన సోమలక్ష్మి శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయమైనా తలుపులు తెరవకపోవడంతో కుటుంబ సభ్యులు వచ్చిచూడగా విగత జీవిగా పడిఉంది. ఈ ఘటనపై కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడు..



కోసయ్య మృతదేహం

వెంకటాపురం(కె): మద్యం కొనుగోలుకు కుటుంబీకులు డబ్బులు ఇవ్వకపోడవంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ముకునూరు పాలెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మడవి కోసయ్య (31) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం సేవించేందుకు కుటుంబీకులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంకటాపురం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆదివారం తెలిపారు.

వెళ్లిపోతున్నా.. పైలం బిడ్డా..

● కూతురికి జాగ్రత్తలు చెప్పి కన్నుమూసిన తల్లి
● రుద్రగూడెంలో ఘటన



మానస(ఫైల్)

నల్లబెల్లి: అత్తారింట్లో కుటుంబ తగాదాలు.. పుట్టింట్లో ఓదార్పు లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వెళ్లిపోతున్నా బిడ్డా.. కోలుకున్న తరువాత పైలంగా ఉండు అంటూ తన రెండేళ్ల కుమార్తెకు జాగ్రత్తలు చెప్పి కన్నుమూసింది. ఈ ఘటన మండలంలోని రుద్రగూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పిండి శ్రీను, స్వరూప దంపతులకు సంతానం లేకపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం శ్రీను తన అక్క కుమార్తె మానస(28)ను రెండో వివాహం చేసుకున్నాడు. వీరి దాంపత్య జీవితంలో కుమారుడు విఘ్నేశ్, కుమార్తె సాత్విక జన్మించారు. కొన్నాళ్లు వీరికాపురం సజావుగానే సాగినా.. ఇటీవల తరుచూ తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాలను పుట్టింట్లో చెప్పినా మానసకు ఓదార్పు లభించలేదు. దీంతో మనస్తాపానికి గురైన మానస శనివారం తన రెండేళ్ల కుమార్తెను తీసుకుని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. అక్కడ పురుగుల మందు తాగింది. తన కుమార్తెకు కూడా బలవంతంగా తాగించింది. గంట తర్వాత బావి నుంచి సమీపంలోని గుంటూరుపల్లి గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో వారు 108లో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని తల్లి, కుమార్తెను నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా తల్లీ మృతి చెందింది. వైద్యుల సూచనల మేరకు కుమార్తెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

● కోమటిపల్లి ఎస్టీ కాలనీలో ఘటన



రామకృష్ణ(ఫైల్)

మంగపేట: విద్యుదాఘాతంతో ఓ గిరిజన కౌలు రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోమటిపల్లి ఎస్టీ కాలనీలో జరిగింది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. కోమటిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన జవ్వాది రామకృష్ణ (32) బూర్కబందాల (కట్టుకాల్వ) సమీపంలోని వట్టం రాములు చెందిన రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ట్రాక్టర్‌తో దమ్ము చేయించేందుకు పొలం వద్దకు వెళ్లి నీరు పారించేందుకు మోటార్‌ను ఆన్‌చేశాడు. మోటార్‌కు కరెంట్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. తీగ సరిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తించిన స్థానిక రైతులు వెంటనే విషయాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్ మధుకు సమాచారం ఇవ్వగా ఆయన విద్యుత్ సరఫరా నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరు నాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పుష్పలత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల విషయంలో పోరాడుతాం



సభలో మాట్లాడుతున్న అల్లం నారాయణ

● జర్నలిస్టులకు కూడా హౌసింగ్ శాఖ పెట్టాలి
● టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

నయీంనగర్: ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీం కోర్టులో పోరాడుతామని, జర్నలిస్టులకు కూడా హౌసింగ్ శాఖ పెట్టాలని టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే(143) హనుమకొండ, వరంగల్ జిల్లాల మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్లం నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో పోరాడుతామని, సుప్రీంకోర్టులో పిల్ వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. న్యాయవాదులతో మాట్లాడి జర్నలిస్టులు ఎలైట్ పీపుల్ కాదని సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎదుట చెప్పే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఏర్పాటు చేసి అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చామన్నారు. సుప్రీంకోర్టులో మనల్ని విడగొట్టే ప్రయత్నం జరుగుతోందని, అక్రిడిటేషన్లు తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 450 కుటుంబాలను ఆదుకున్నామని, చనిపోయిన 55 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 2లక్షల చెక్ లు ఇచ్చి ఆదుకున్నామన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశామని, జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చామన్నారు. లక్షల కోట్లతో డిజిటల్ మీడియా రాబోతోందన్నారు. మార్చిలో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, సలహాదారు రమేశ్ హజారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, కార్యదర్శి తడక రాజనారాయణ, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కోశాధికారి యోగానంద్, జర్నలిస్ట్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

వరంగల్ కమిటీ ఎన్నిక..



కె. నరేందర్
అధ్యక్షుడు



వాంకే శ్రీనివాస్
ప్రధాన కార్యదర్శి

టీయూడబ్ల్యూజే(143) వరంగల్ జిల్లా నూతన కమిటీని సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరుకొప్పుల నరేందర్, ప్రధాన కార్యదర్శిగా వాంకే శ్రీనివాస్, కోశాధికారిగా రాపల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా మిట్ట నవనీత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నీలం శివ, కోశాధికారిగా బైరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

● జేఏసీ చైర్మన్, టీజీటీఏ అధ్యక్షుడు లచ్చిరెడ్డి

వరంగల్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ ఐశ్వర్య గార్డెన్‌లో జరిగిన తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నేతలు రెవెన్యూ వ్యవస్థను ధ్వంసం చేశారని అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించి నిర్ణయం తీసుకుందని, అందుకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేసేలా ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చి పట్టాదార్ పాస్ బుక్కులు జారీ చేసే అధికారం తహసీల్దార్‌కు, ఆర్‌డీఓకు కల్పించడం శుభపరిణామని స్టేట్ జనరల్ ప్రెసిడెంట్ రమేశ్ పాక అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల జారీ విషయంలో ఎలాంటి సమస్య అయినా మండల స్థాయిలో పరిష్కరించడానికి ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని ఫూల్ సింగ్ చౌహాన్ చెప్పారు. తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ సభ్యత్వం కోసం యాప్‌లో నమోదును ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రారంభిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు రాములు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలను విభజించి 60 ఏళ్లలోపు వారికి జూనియర్ అసిస్టెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారని, 61 ఏళ్లు దాటిన వారికి పెండింగ్‌లో ఉన్నందున సానుకూలంగా పరిశీలించి పోస్టింగ్ ఇప్పించాలని టీజీటీఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇక్బాల్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫూల్‌సింగ్ చౌహాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్రమ్‌కుమార్, సూర్య, రేణుక తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా రంజిత్ కుమార్, జనరల్ సెక్రటరీగా జి.నాగేంద్రప్రసాద్, వరంగల్ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీగా కీర్తన్, వైస్ ప్రెసిడెంట్‌లుగా సుభాన్, సుమన్, జలపతి ఎంపికయ్యారు.

సీఎం కప్ పోటీల్లో ఆతిథ్య జిల్లా హవా



పతకాలు సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా క్రీడాకారులు హవా కొనసాగించారు. హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి సత్తా చాటారు.

జేఎన్ఎస్‌లో నిర్వహించిన పోటీలు..

హ్యాండ్‌బాల్ : బాలుర విభాగంలో ఉమ్మడి వరంగల్ జట్టు విజేతగా నిలబడింది. బాలికల కేటగిరిలో వరంగల్ రెండో స్థానంలో నిలవగా, రంగారెడ్డి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

సెపక్‌తక్రా : హైదరాబాద్ పురుషులు, మహిళల జట్లు స్వర్ణ పతకాలు సాధించారు. మహిళల విభాగంలో కామారెడ్డి రజత పతకం, నిజామాబాద్ కాంస్య పతకం సాధించగా, పురుషుల కేటగిరీలో రంగారెడ్డి రజతం, ఆసిఫాబాద్ కాంస్యపతకాలను సాధించారు.

కిట్స్ కళాశాలలో..

షటిల్ బ్యాడ్మింటన్ : బాలుర డబుల్స్‌లో అఖిల్‌రావు, ఎం.అజయ్‌కార్తీక్(హనుమకొండ) జోడి సీహెచ్.వినయ్, సహస్‌రెడ్డి రంగారెడ్డిపై ఘన విజయం సాధించారు. బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.కీర్తి, బాలుర విభాగంలో కె.అఖిల్‌రావు స్వర్ణ పతకాలు సాధించారు.

షటిల్ బ్యాడ్మింటన్ : అండర్–19 సింగిల్స్ బాలికల విభాగంలో ఎం.కీర్తి, బాలుర విభాగంలో కె.అఖిల్‌రావు స్వర్ణ పతకాలు సాధించారు. డబుల్స్ విభాగంలో ఎం.పూజిత, నిఖితారావు బంగారు పతకాలు సాధించారు.

ముగిసిన సీఎం కప్ పోటీలు

● వాలీబాల్‌లో వరంగల్ బాలుర జట్టు ప్రథమ స్థానం కైవసం



ప్రథమస్థానం కైవసం చేసుకున్న వరంగల్ బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడల్లో భాగంగా నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన బాలబాలికల పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, మహబూబ్‌నగర్ ద్వితీయ, ఖమ్మం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు టైటిల్ దక్కించుకోగా, రెండో స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు, తృతీయస్థానం ఖమ్మం జట్టు కైవసం చేసుకుంది. ఆయా స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులకు బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు త్వరలో అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.క్రిస్టాఫర్‌బాబు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.గోవిందరెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కె.నర్సింహమూర్తి, నరేశ్, షఫీక్ అహ్మద్, టెక్నికల్ చైర్మన్ గణపతి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంలో రజకులకు పెద్దపీట వేయాలి

● ప్రొఫెసర్ కంచె ఐలయ్య

జనగామ రూరల్: సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్న రజకులకు ప్రజా సంక్షేమంలో పెద్ద పీట వేయాలని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ రజక రిజర్వేషన్ మూడో మహాసభలో ఆయన మాట్లాడుతూ.. చాకలి వారు ఉతికిన బట్టలను నాయకులు వేసుకుంటున్నారే తప్ప వారి కష్టాలను అర్థం చేసుకోవట్లేదన్నారు. చాకలి ఐలమ్మ యూనివర్సిటీ అని కోటి ఉమెన్స్ కాలేజీకి నామకరణం చేయడం హర్షణీయమన్నారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, స్త్రీలకు రక్షణ చట్టం కల్పించాలని కోరారు. జాతీయ అధ్యక్షుడు నడిమిటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోని 11 రాష్ట్రాల్లో రజకులు ఓబీసీగా ఉండడం చాలా బాధాకరమని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆలోచించి ఎస్సీ జాబిలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, పీఠాధిపతి డాక్టర్ శ్రీనివాస్ స్వామీజీ, 33 జిల్లాల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న కంచె ఐలయ్య